TGTEL/26/A7716

ఉద్యమ పోరు

ప్రతి పదం పోరాట కదం

UDYAMA PORU

వరంగల్	సంపుటి : 1	సంచిక : 12	శుక్రవారం	25.09.2026	పేజీలు : 8	వెల : 3 /-	ఎడిటర్ - బండారి సుమంత్
Warangal	Volume - 1	Issue - 12	Friday	25.09.2026	Pages - 8	Price: 3 /-	Editor - Bandari Sumanth

రాహుల్, రేవంత్‌లకు సుప్రీం తీర్పు ఓ చెంపపెట్టు : కేటీఆర్

- దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు
- ఇది రాహుల్, రేవంత్‌కు తగిలిన చెంపపెట్టు అన్న కేటీఆర్
- ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ
- రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు

2

జాతీయ అందాల పోటీల్లో మెరిసిన ఆదిలాబాద్ యువతి

- జైపూర్‌లో జరిగిన మిస్ ఎర్త్ ఇండియా పోటీల్లో విజయం
- మిస్ ఇండియా ఎర్త్ వాటర్ 2026 కిరీటం కైవసం
- ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ప్రీతి ముండే
- మిస్ కంజీనియాలిటీ ప్రత్యేక పురస్కారం కూడా సొంతం

ఇక 22A భూములకూ రిజిస్ట్రేషన్లు..

లక్షలాది మందికి భారీ ఊరటనిచ్చిన ప్రభుత్వం!

- 22ఏ జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లు, భవనాలకు వర్తింపు
- తక్షణమే అమల్లోకి వచ్చిన తాజా ఆదేశాలు
- వేలాది మంది ఆస్తి యజమానులకు దక్కనున్న భారీ ఊరట
- అక్రమాలపై విచారణకు శ్రీదేవసేన నేతృత్వంలో ప్రత్యేక కమిటీ

ఉద్యమపోరు, హైదరాబాద్ : రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు.ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉంటారు. 22ఏ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది.

హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు

- గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఎస్సై వెంకన్న మృతి
- హైదరాబాద్‌లో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఘటన
- ప్రమాదం తర్వాత స్వగ్రామానికి వెళ్లగా ఆరోగ్యం క్షీణించి కన్నుమూత

ఉద్యమపోరు, హైదరాబాద్ : భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతి చెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి ......

2

అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

2

వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

- సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు బ్యాంకుల సమ్మె
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ముందే జీతాలు
- సెప్టెంబర్ 25నే వేతనాలు చెల్లించాలని కేంద్రం ఆదేశం
- ప్రజల సౌలభ్యం కోసం ఆదివారం బ్యాంకులు తెరిచి ఉంచాలని నిర్ణయం

ఉద్యమపోరు, న్యూ ఢిల్లీ : దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్లను ముందుగానే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 25వ తేదీనే వేతనాలు అందనున్నాయి.

2

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషనను కోర్టు స్వీకరించింది : హరీశ్ రావు

- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ
- ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య

2

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం : జగదీశ్ రెడ్డి

- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పరిశీలించిన జగదీశ్ రెడ్డి
- విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ
- 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని మండిపాటు

2

'ఎన్నికలకు సిద్ధం అవుతా'..

సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

- సుప్రీం తీర్పును గౌరవిస్తున్నానన్న దానం
- న్యాయపోరాటం చట్టపరంగానే చేశానని వెల్లడి
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధమని ప్రకటన
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమం

ఉద్యమపోరు, హైదరాబాద్ : ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

2

'ఎన్నికలకు సిద్ధం అవుతా'..
సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

మొదటిపేజీ తరువాయి.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.

అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

మొదటిపేజీ తరువాయి.. దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి.

అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (P2M – పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే (P2P – పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (P2PM) కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

వ్యాపారుల ఆందోళన ఎందుకు?

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (MACCIA), ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (AICPDF) వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

జాతీయ అందాల పోటీల్లో మెరిసిన ఆదిలాబాద్ యువతి

మొదటిపేజీ తరువాయి.. ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన యువతి ప్రీతి ముండే జాతీయ స్థాయి అందాల పోటీల్లో విజేతగా నిలిచింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 19న జరిగిన 'మిస్ డివైన్ బ్యూటీ 2026' గ్రాండ్ ఫినాలేలో ఆమె 'మిస్ ఇండియా ఎర్త్ వాటర్ 2026' కిరీటాన్ని కైవసం చేసుకుంది. దీంతో పాటు 'మిస్ కంజీనియాలిటీ' ప్రత్యేక పురస్కారాన్ని కూడా గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. డివైన్ బ్యూటీ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో ప్రీతి ముండే తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. మహారాష్ట్రకు చెందిన ఆర్య ఆవధూత్ ప్రధాన టైటిల్ అయిన 'డివైన్ మిస్ ఎర్త్ ఇండియా 2026'ను గెలుచుకోగా, ముఖ్యమైన ఎలిమెంటల్ టైటిల్స్‌లో ఒకటైన 'వాటర్' కిరీటాన్ని ప్రీతి దక్కించుకుంది. ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ అనే చిన్న గిరిజన గ్రామానికి చెందిన ప్రీతి పట్టుదలతో తన కలను సాకారం చేసుకుంది. తల్లిదండ్రులు ముండే ప్రహ్లాద్, ఉమా. గ్రామీణ నేపథ్యం నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రీతి మోడలింగ్ రంగంలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. గతంలో 'మిస్ హైదరాబాద్ రన్నరప్', 'మిస్ మహారాష్ట్ర (బ్రెయిన్ విత్ బ్యూటీ)' వంటి టైటిల్స్‌ను కూడా గెలుచుకుంది. మోడలింగ్‌తో పాటు జ్యోతిష్యం, టారోట్ రీడింగ్ వంటి అంశాలపై కూడా ఆమెకు ఆసక్తి ఉంది. ఒక మారుమూల ఏజెన్సీ గ్రామం నుంచి వచ్చిన యువతి జాతీయ వేదికపై విజయం సాధించడంపై ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ప్రీతి నిరూపించిందని అభినందిస్తున్నారు.

హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం..
నిందితుడి కోసం పోలీసుల గాలింపు

మొదటిపేజీ తరువాయి.. పరారయ్యాడు. ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఎస్సై మృతిపై సీపీ సజ్జనార్ తీవ్ర విచారం

ఎస్సై వెంకన్న మృతి పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. "గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకన్నగారు గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం అత్యంత బాధాకరం, దురదృష్టకరం. ప్రజల భద్రత కోసం పనిచేస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం తెలంగాణ పోలీసు శాఖకు తీరని లోటు" అని అన్నారు. ఈ విషాద సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కమిషనర్, ఆ కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం : జగదీశ్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..
నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఎదురవుతున్న బొగ్గు కొరతకు, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన ఈరోజు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది : హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి..
తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి.. దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్లను ముందుగానే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 25వ తేదీనే వేతనాలు అందనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ఈ మేరకు ఒక అధికారిక మెమోరాండం విడుదల చేసింది. దీని ప్రకారం, రక్షణ, పోస్టల్, టెలికమ్యూనికేషన్స్ విభాగాలతో సహా అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు శుక్రవారం నాడే జీతాలు చెల్లించనున్నారు. అదే రోజున కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు కూడా పెన్షన్లు అందజేస్తారు. ఈ ముందస్తు చెల్లింపులను అక్టోబర్ బకాయిలలో సర్దుబాటు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. వారానికి ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు ఈ సమ్మె కొనసాగనుంది. ఇది బ్యాంకులకు అర్ధ సంవత్సర ముగింపు సమయం కావడం గమనార్హం.

స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు" : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ @రాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ప్రశ్నించారు.

పిడుగుపాటుతో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం

- పాక్షికంగా దెబ్బతిన ఇంటిని పరిశీలించిన
- మండల ఎంపీడీవో సూర్ణ ఆదర్శ్ గౌడ్
- మండల తహసిల్దార్ శ్రీనివాస్
- ఉమ్మడి మండలాల మాజీ జడ్పీటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్

ఉద్యమపోరు, వనపర్తి , సెప్టెంబర్ 18 : చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మి పల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్ ఇంల్లు పిడుగుపాటుకు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మండలాల మాజీ జడ్పీటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్ ఉటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చిన్నంబావి మండల ఎంపీడీవో మరియు తాహసిల్దార్ గారికి సమాచారం ఇచ్చి పిడుగుపాటుకు దెబ్బతిన్న సంపంగి ఈశ్వర్ ఇంటిని పరిశీలన చేశారు. విద్యుత్ వైర్లలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లోని విద్యుత్ పరికరాలు, సామగ్రి దెబ్బతిన్నట్లు సమాచారం. అగ్ని ప్రమాదంతో ఇంట్లో కూలరు, వాషిం, ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, గోడలు, కరెంటు వైర్లు బోర్డులు మీటరు పైభాగం తదితర ప్రాంతాలు పొగతో నల్లగా మారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఇంట్లోని సామగ్రి, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లడంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తెలిపింది. పిడుగుపాటుకు ప్రాణనష్టం తప్పినా.. భారీ ఆస్తి నష్టం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ఘటనతో సంపంగి ఈశ్వర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ఘటనను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.1.35 లక్షలకు వినాయకుడి లడ్డూ

- కైవసం చేసుకున్న తూంకుంట జగదీశ్‌గౌడ్.. ఘనంగా గణేశుడి శోభాయాత్ర

ఉద్యమపోరు, శామీర్‌పేట్, సెప్టెంబర్ 24 : దేవరయాంజాల్‌లో నిర్వహించిన గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో తూంకుంటకు చెందిన జగదీశ్‌గౌడ్ రూ.1.35 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో ఇగ్నైట్ వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11 రోజులుగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వినాయక విగ్రహాన్ని దాత కట్ట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు సమకూర్చగా, అన్నప్రసాద కార్యక్రమాన్ని దాతలు మోటే బాలయ్య, గంధం ప్రవీణ్ కుటుంబ సభ్యులు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నిర్వహించిన లడూ వేలం పాటలో పలువురు భక్తులు పాల్గొనగా జగదీశ్‌గౌడ్ రూ.1,35,000లకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం అతిథులు లడ్డూను ఆయనకు అందజేశారు.కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇ.శ్రీనివాస్, డివిజన్ బీజేపీ నాయకులు పి.నర్సింహారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.విగ్రహ దాత కట్ట శ్రీకాంత్‌రెడ్డి, అన్నప్రసాద దాతలు మోటే బాలయ్య, గంధం ప్రవీణ్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు దాతలను ఇగ్నైట్ వింగ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.తదుపరి ఇగ్నైట్ వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశుడి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి గణనాథుడికి నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.బాలయ్య, పి.సుధాకర్‌రెడ్డి, ఎన్.శంకర్‌రెడ్డి, వి.రాజిరెడ్డి, జి.ప్రవీణ్‌గౌడ్, యం.లక్ష్మణ్, యం.శేఖర్‌గౌడ్, ఎం.రమేష్, ఎం.హుస్సేన్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ గేటు వద్ద బీఆర్ఎస్ మహా ధర్నా!

- నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి: మాజీ మంత్రి పువ్వాడ
- కాంగ్రెస్ కరెంటు కుట్రలను బయటపెడతాం: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

ఉద్యమపోరు, పినపాక, సెప్టెంబర్ 24 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల సరిహద్దులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు భారీ 'మహా ధర్నా' నిర్వహించారు. పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హాజరయ్యారు. నియోజకవర్గ నలుమూలల నుంచి గులాబీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీగా తరలి రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి నేతృత్వంలో పోలీసులు భారీగా మోహరించడంతో ధర్నా ప్రాంగణంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అసమర్థ పాలనతో విద్యుత్ రంగానికి గండి:ధర్నాను ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అడ్డుకోవడం చూస్తుంటే.. మనం భారతదేశంలో ఉన్నామా లేక పాకిస్తాన్‌లో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది" అని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సుదీర్ఘంగా పోరాడి కెసిఆర్ నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణలో, పారిశ్రామికాభివృద్ధికి విద్యుత్ అత్యంత కీలకమని భావించి కేసీఆర్ ముందుచూపుతో బీటీపీఎస్‌ను నిర్మించారని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగ సంస్థ 'బెల్' ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్లాంట్‌ను పూర్తి చేశారని తెలిపారు.అయితే, ప్రస్తుత రేవంత్ రెడ్డి అసమర్థత వల్ల బీటీపీఎస్‌లోని నాలుగు యూనిట్లకు గాను కేవలం రెండు యూనిట్లలోనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండటం విచారకరమన్నారు. ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడంలో సింగరేణి విఫలమవుతున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను నిలిపివేసి ఆ సంస్థను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్:ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్, శాంతియుతంగా చేసే ధర్నాలకు కూడా అనుమతులు ఇవ్వకపోవడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని విమర్శించారు. "అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని" అన్నట్లుగా రాష్ట్రంలో సరిపడా వనరులు ఉన్నా, వాటిని సరిగ్గా వినియోగించుకోలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అసమర్థ పాలన అందిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ మహా ధర్నా కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు,, అభిమానులు విస్తృతంగా పాల్గొన్నారు.

కొత్తచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలి :ముకుంద నాగేశ్వర్

ఉద్యమపోరు, వికారాబాద్, సెప్టెంబర్ 24 : వికారాబాద్ జిల్లా పరిగి: పట్టణంలోని కొత్తచెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.సుమారు 28 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న చెరువులో కొద్దిపాటి ప్రాంతంలో మాత్రమే పనులు చేపట్టి అభివృద్ధి జరిగిందని ప్రకటించడం సరికాదన్నారు. చెరువు మొత్తం విస్తీర్ణాన్ని అభివృద్ధి చేసి, ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. బోటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.చెరువు పూర్తి నీటి మట్టం పరిధిలో ఇచ్చిన భూ లేఅవుట్లపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రత్యామ్నాయ భూమి కేటాయించాలని కోరారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి కొత్తచెరువును శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ముకుంద నాగేశ్వర్ డిమాండ్ చేశారు.

నాగర్‌కుంటలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు

ఉద్యమపోరు, షాబాద్, సెప్టెంబర్ 24 : షాబాద్ మండలం నాగర్‌కుంట గ్రామంలో వెల్స్పన్ ఫౌండేషన్ సహకారంతో జన వికాస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (JVRDS) ఆధ్వర్యంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు.సేంద్రీయ వ్యవసాయ నిపుణులు జి. శశ్రీకాంత్ మాట్లాడుతూ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తయారీ, వినియోగంపై రైతులకు వివరించారు. వీటి వినియోగంతో నేల సారం, సేంద్రియ కార్బన్ పెంచడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు.వెల్స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ, సేంద్రీయ ఉత్పత్తులకు ఉన్న మార్కెట్ డిమాండ్, మెరుగైన ధరలు, మార్కెటింగ్ అవకాశాలు, రైతుల ఆదాయాభివృద్ధిపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లయ్య, వేల్స్పన్ కోఆర్డినేటర్ బద్రి, JVRDS CEO సంపత్ కుమార్, ఆర్గానిక్ ఎక్స్పర్ట్ శ్రీకాంత్, సిబ్బంది రామకృష్ణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత యువతే వికసిత్ భారత్‌కు పునాది

- ఆరోగ్యంపై అవగాహన కల్పించిన 'మై హెల్త్–మై ప్రైడ్' కార్యక్రమం

ఉద్యమపోరు, శామీర్‌పేట, సెప్టెంబర్ 24 : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్–100 వారాల సంకల్ప్ అభియాన్'లో భాగంగా 'మై హెల్త్–మై ప్రైడ్' ఇతి వృత్తంతో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.మై భారత్–ఎన్ఎస్ఎస్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.స్రవంతి, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.గీత విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆరోగ్యం, పోషకాహారం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రభుత్వ ఆసుపత్రి ఘట్‌కేసర్‌కు చెందిన డాక్టర్ ప్రవీణ్, కీసర ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక 'పోషకాహారం ప్రాముఖ్యత–మంచి ఆరోగ్యం' అంశంపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని వివరించారు.కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.అనిత ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని కార్యక్రమంలో సందేశమిచ్చారు. ఆరోగ్యవంతమైన యువత–మాదకద్రవ్యాల రహిత సమాజం–వికసిత్ భారత్ లక్ష్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించారు

అన్నదానం ప్రారంభం

ఉద్యమపోరు, ఖమ్మం, వైరా, సెప్టెంబర్ 18 : ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డు నందు శ్రీ శక్తి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు, వైరా ఎస్సై పుష్పాల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ లు ప్రారంభించారు. అంతకు ముందు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం వైరా ఎస్సై పుష్పాల రామారావును, కమిషనర్ రామచంద్రావును కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కట్ల నాగరాజు, కాంపౌండ్ శేషగిరి, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రామారావు, రేచర్ల సైదులు, చెరుకూరి కిరణ్, పోలూరి సైదులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైరా పై ప్రత్యేకంగా దృష్టి సారించాలి : పురపాలక యంత్రాంగం ఆదేశాలు జారీ

ఉద్యమపోరు, ఖమ్మం, వైరా, సెప్టెంబర్ 24 : వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంపై పురపాలక యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాల వల్ల వార్డులలో తలెత్తిన డ్రైనేజీ సమస్యలు, మురుగునీటి ప్రవాహ పరిస్థితిని గురువారం మున్సిపల్ కమిషనర్ రామ చంద్రరావు, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలో మురుగునీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానికంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఆయా వార్డుల కౌన్సిలర్లకు సమాచారం అందించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అంతా ప్రజలకు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.ఒకవైపు వినాయక నిమజ్జన కార్యక్రమాలు, మరొకవైపు వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా మున్సిపాలిటీ కార్మికులు అనునిత్యం అందుబాటులో ఉండి విధులు నిర్వర్తిస్తున్నారని కమిషనర్, వైస్ చైర్మన్ వివరించారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని వారు కోరారు.

పాలెపు ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జన కార్యక్రమం

ఉద్యమపోరు, ఖమ్మం, సెప్టెంబర్ 24 : ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ లో వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి, అనంతరం డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాని ఘనంగా నిర్వహించారు. తొలుత వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించిన తర్వాత లడ్డు పాట నిర్వహించడం జరిగింది. ఈ పాటను పాలెపు విజయ వెంకటరమణ తనయుడు దక్కించుకున్నారు. అనంతరం డివిజన్ మొత్తం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గంగ వడికి తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలెపు వెంకటరమణ, డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, వారి కుటుంబ సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌కు రోడ్డు ప్రమాదం

- లారీ ఢీకొని పోలీస్ వాహనం ధ్వంసం
- ఎస్సైతో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఉద్యమపోరు, ఖమ్మం, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24 : కూచిపూడి జగదీష్ రోడ్డు ప్రమాదానికి గురైనట్లు సమాచారం. వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో విధులు నిర్వహించిన అనంతరం పిండిప్రోలు గ్రామం నుంచి తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.గురువారం అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో భవాని హోటల్ సమీపంలో ఎస్సై జగదీష్, ఆయన డ్రైవర్ పోలీస్ వాహనంలో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో పోలీస్ వాహనం తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.ప్రమాదంలో ఎస్సై కూచిపూడి జగదీష్‌తో పాటు డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌కు కూడా తీవ్రమైన గాయాలైనట్లు సమాచారం. కాకరవాయి గ్రామానికి చెందిన రాకేష్‌కు తలకు బలమైన గాయాలు అయినట్లు తెలుస్తోంది.ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుమలాయపాలెం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని స్తంభాద్రి ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది.అయితే ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలు, లారీ వివరాలు, గాయాల తీవ్రతపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో తిరుమలాయపాలెం ఎస్సైకు తీవ్ర గాయాలు

- క్షతగాత్రులను పరామర్శించిన తుంబూరు దయాకర్ రెడ్డి

ఉద్యమపోరు, ఖమ్మం, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24 : వినాయక నిమజ్జనం సందర్భంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌తో పాటు డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై తిరుమలాయపాలెం పరిసర ప్రాంతంలోని భవాని హోటల్ సమీపంలో చోటుచేసుకుంది.పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసు వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఎస్సై జగదీష్, ప్రైవేట్ డ్రైవర్ రాకేష్ గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను ఖమ్మం పట్టణంలోని స్తంభాద్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్సై జగదీష్‌కు గాయాలు కాగా, డ్రైవర్ రాకేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ప్రమాద విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, స్తంభాద్రి ఆసుపత్రికి చేరుకుని ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్‌లను పరామర్శించారు.అనంతరం వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని కోరారు. ముఖ్యంగా డ్రైవర్ రాకేష్ పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న తుంబూరు దయాకర్ రెడ్డి, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాకేష్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తామని తెలిపారు.

మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సందర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బృందం

ఉద్యమపోరు, ఖమ్మం, మణుగూరు, సెప్టెంబర్ 18 : కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాతరోజుల కరెంట్ కోతలు, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైతులకు, గృహ వినియోగదారులకు, పారిశ్రామిక అవసరాలకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పాతరోజుల కరెంట్ కోతలు, విద్యుత్ కష్టాలు ప్రారంభమయ్యాయి.రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 8 గంటల కరెంట్ మాత్రమే అదీ విడతల వారీగా ఇస్తోంది. ఎనిమిది గంటల పాటు అందరూ ఒకేసారి సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఆధారపడి మోటార్లు ఆన్ చేయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి, లో–వోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయి. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుకోవడానికి రైతులు మళ్లీ తమ సొంత డబ్బులు వేసుకోవాల్సిన దుస్థితి దాపురించింది. తెలంగాణలోని థర్మల్ పవర్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గు సరఫరా కావాలంటే సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బాకీలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి. చెల్లింపులు చేయకపోవడం, నిర్వహణా లోపాల వల్ల విద్యుత్ ఉత్పాదన దెబ్బతింటోంది. సింగరేణిలో ప్రతిరోజూ ఒక స్కామ్, కోల్ కుంభకోణాలు జరుగుతున్నాయి. కేసీఆర్ హయాంలో రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని 19,000 మెగావాట్లకు పెంచి, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లను అద్భుతంగా నిర్మించి "వడ్డించిన విస్తరి"లా కాంగ్రెస్‌కు అప్పగిస్తే, వారు మూడేళ్లలోనే విద్యుత్ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. హైడల్ పవర్ ప్లాంట్లలో నీళ్లు లేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. థర్మల్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా సరిగ్గా లేక విద్యుత్ కొరత ఏర్పడుతోంది. కేటీఆర్ పిలుపు మేరకు విద్యుత్ ప్లాంట్ల పరిసితిని తెలుసుకోవడానికి భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించడానికి వస్తే, అధికారులు లోపలికి అనుమతించకుండా ఆంక్షలు విధించడం శోచనీయం. 4 యూనిట్లలో 2 యూనిట్లు పనిచేయడం లేదని అధికారులే చెబుతున్నారు, ఆ పరిస్థితిని నిరసిస్తున్నాం. రైతాంగానికి, గృహాలకు, పరిశ్రమలకు తక్షణమే నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను పునరుద్ధరించాలి. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. పవర్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసి విద్యుత్ ఉత్పాదన పూర్తి స్థాయిలో సాగేలా చూడాలి.కాలిపోయిన రైతు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు తక్షణ ఉచిత రిపేర్లు, మార్పిడి చేపట్టి వ్యవసాయాన్ని ఆదుకోవాలి.

పీఏసీఎస్ చైర్మన్లుగా అనిల్‌రావు, కుమారస్వామి

ఉద్యమపోరు, వరంగల్ / పర్వతగిరి, సెప్టెంబర్ 24 : పర్వతగిరి, చౌటపల్లి పీఏసీఎస్‌ల నూతన చైర్మన్లుగా పిన్నింటి అనిల్‌రావు, అత్తి కుమారస్వామి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్లతో పాటు ఆయా పీఏసీఎస్‌ల డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ కడియం కావ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ పరిధిలోని రైతులకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని, గతంలో జరిగిన తప్పిదాలను పరిశీలించి వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందాల్సిన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఎరువుల విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, ఆయా గ్రామాల అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు, మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై నూతన చైర్మన్లు, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

మహంకాళి వీధిలో ఘనంగా గణపతి విగ్రహ ఉద్వాసన

ఉద్యమపోరు, వరంగల్, సెప్టెంబర్ 24 : వరంగల్ నగరంలోని 42వ డివిజన్ మహంకాళి వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి విగ్రహ ఉద్వాసన కార్యక్రమాన్ని శ్రీ వెలిది ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే విధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. కాలనీవాసుల సహకారంతో ఉత్సవాలను ఐకమత్యంతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సంఘంలోని సభ్యులు, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలకు సహకరించిన దాతలు, కాలనీవాసులు, సంఘం సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రతి సంవత్సరం మరింత భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాలను నిర్వహించుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.

మామిడిగూడెంలో కంటైనర్ పాఠశాల ప్రారంభం

- సింగరేణి సీఎస్ఆర్ నిధులతో రూ.15 లక్షలతో ఏర్పాటు

ఉద్యమపోరు, ఏటూరునాగారం, సెప్టెంబర్ 24 : ఏటూరునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు.అనంతరం మంత్రి సీతక్క పాఠశాల విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు జిల్లా కలెక్టర్‌తో కలిసి ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు, సంబంధిత శాఖల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణబాబు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

తాళ్ల మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు

ఉద్యమపోరు, వరంగల్ , సెప్టెంబర్ 24 : వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చార్‌బౌలి ప్రాంతానికి చెందిన లర్నెస్ ల్యాండ్ స్కూల్, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గురువారం ఆయన నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా తాళ్ల మల్లేశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి, సీనియర్ నాయకులు కోమాకుల నాగరాజు, రత్నం కృష్ణకిషోర్, ముత్తినేని లక్ష్మణ్, మరుముల్ల ప్రవీణ్, మంతెన అనిత తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే.. కాటాపురం రోడ్ల దుస్థితి

- అధ్వానంగా రోడ్లు.. అసంపూర్తిగా డ్రైనేజీ పనులు
- నీటి నిల్వలతో దోమల బెడద.. సీజనల్ వ్యాధులపై ఆందోళన

ఉద్యమపోరు, ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 24 : తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు సగం వరకే పూర్తికావడంతో వర్షం పడినప్పుడు నీరు రోడ్లపై నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అపరిశుభ్రత నెలకొని దోమల బెడద పెరుగుతోందని, సీజనల్ వ్యాధులు, డెంగ్యూ వంటి వ్యాధులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొంతమంది రైతులు పశువులను రోడ్లపైనే కట్టివేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. గ్రామంలోని సైడ్ కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో వాటిలో కూడా నీరు నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. మరోవైపు కొంతమంది గ్రామపంచాయతీ సరఫరా చేస్తున్న నీటిని అవసరమైనంత మేరకు వినియోగించుకుని, మిగిలిన నీటిని రోడ్లపైకి వదులుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా రోడ్లపైకి నీటిని వదిలే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే గ్రామంలో దోమలు, కోతుల బెడద నివారణకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యలను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాటాపురం గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మేడారంలో కొబ్బరికాయకు అధిక ధరలు?

- ₹30 కొబ్బరికాయను ₹60కు విక్రయిస్తున్నారంటూ భక్తుల ఆరోపణలు
- ధరల పట్టిక ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలని డిమాండ్

ఉద్యమపోరు, ములుగు జిల్లా / మేడారం, సెప్టెంబర్ 24 : మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లుల సన్నిధిలో పూజా సామగ్రి విక్రయాలపై భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరు వ్యాపారులు కొబ్బరికాయలు, ఇతర పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా సుమారు రూ.30కు లభించే కొబ్బరికాయను మేడారంలో రూ.60కు విక్రయిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపించారు. ధరపై ప్రశ్నిస్తే కొందరు వ్యాపారులు టెండర్ పేరుతో సమాధానం చెబుతున్నారని వారు పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి మేడారం వచ్చే భక్తులు పూజా సామగ్రిని తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి ఉండటంతో, వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూజా సామగ్రి విక్రయించే దుకాణాల్లో స్పష్టమైన ధరల పట్టిక ఏర్పాటు చేసి, ధరలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని భక్తులు కోరుతున్నారు. అధిక ధరలపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. “సమ్మక్క–సారలమ్మ తల్లులను దర్శించుకోవడానికి భక్తితో వస్తున్నాం. పూజా సామగ్రికి అధిక ధరలు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి” అని పలువురు భక్తులు కోరారు.

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ప్లాన్

13 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు.. రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ఉద్యమపోరు, భువనగిరి టౌన్, సెప్టెంబర్ 24 : జిల్లాలో పత్తి కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, కనీస మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ ఏడాది పత్తికి కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.8,667 కనీస మద్దతు ధర నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.557 పెరిగిందన్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, దాదాపు 6.75 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. దీంతో సుమారు 35 వేల మంది పత్తి రైతులకు ప్రయోజనం కలగనుందని తెలిపారు.రైతులు తమ పత్తిని మద్దతు ధరకు విక్రయించుకునేలా జిల్లాలోని 13 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, నాణ్యత పరిశీలన, మౌలిక వసతులు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి

ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రమణా రెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, సీసీఐ మహబూబ్‌నగర్ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్, జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ సభ్యులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంధిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలి - ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్‌రావు

ఉద్యమపోరు, భువనగిరి టౌన్, సెప్టెంబర్ 24 : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ ప్రయోజనం అందేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల మంజూరు, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అర్హులైన గుడిసెవాసులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్ల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పార

దర్శకతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ అలివేలు, ఉప కార్యనిర్వహణ ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గణనాథుని శోభాయాత్ర

ఉద్యమపోరు, భువనగిరి టౌన్, సెప్టెంబర్ 24 : భువనగిరి పట్టణంలోని ప్రగతి నగర్‌లో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణనాథుని శోభాయాత్ర గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భక్తులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. శివాజీ యూత్ శాశ్వత అధ్యక్షులు గ్యాస్ చిన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, పోత్నాక్ ప్రమోద్ కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, ఇలియాస్, బెండ శ్రీకాంత్, గుర్రాల శ్రీనివాస్, డాకోరీ ప్రకాష్, శోభన్ బాబు, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. శోభాయాత్రలో యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా

వీడ్కోలు పలికారు. శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కొంటూరూ చెరువు వద్ద బారీ భద్రతా ఏర్పాట్లు

ఉద్యమపోరు, మెదక్, సెప్టెంబర్ 24 : కొంటూర్ చెరువు వద్ద శుక్రవారం జరగనున్న గణేష్ నిమజ్జనాల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. నిమజ్జన ప్రాంతం, శోభాయాత్ర మార్గాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. చెరువులో నిమజ్జనం సందర్భంగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, వారు మద్యం సేవించి విధులకు హాజరు కాకుండా చూడాలని ఆదేశించారు. క్రేన్లను నడిపే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కీలక ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, నిమజ్జన ప్రాంతంలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని

శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ నిబంధనలు పాటించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమీషనర్, సీఐ కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో నెరవేరనున్న మినీస్టేడియం కల

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల అయినటువంటి మినీస్టేడియం ఏర్పాటు ఎట్టకేలకు తీరనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి స్థల పరిశీలన చేశారు. ఇబ్రహీంపట్నంలో జోనల్‌స్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి గురువారం హాజరైన ఆయనకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు క్రీడామైదానం అంశమై విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో, రెవెన్యూ అధికారులను అక్కడికి పిలిపించారు. కార్యక్రమం అనంతరం, గురునానక్ కళాశాల ఎదురుగా సర్వేనంబర్ 320లో గల స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆరున్నర ఎకరాలు స్టేడియంకు కేటాయింపు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీవోకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మినీస్టేడియం ఏర్పాటు చేసే బాధ్యత తనదని విద్యార్థులకు ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఎమ్మార్వో సునీత రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్స్ ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనం.. ఇద్దరిపై కేసు

ఉద్యమపోరు, మెదక్, సెప్టెంబర్ 24 : కౌడిపల్లి మండలం ధర్మసాగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నకిలీ నంబర్ ప్లేట్‌తో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని గుర్తించి పోలీస్‌లు కేసు నమోదుచేశారు. కౌడిపల్లి ఎస్ఐ అమర్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా జంగం శ్రీశైలం, రవీందర్ లు యాక్టివా వాహనంపై వచ్చినట్లు తెలిపారు. వాహన నంబర్ ప్లేట్‌పై ఉన్న నంబర్‌కు సంబంధించిన చలాన్ల వివరాలను పరిశీలించగా సమాచారం లభించలేదన్నారు. దీంతో అనుమానం వచ్చి వాహనం చాసిస్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించగా చాసిస్ నంబర్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్ వేరుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అసలు వాహన యజమానికి శ్రీశైలం, రవీందర్‌లతో ఎలాంటి సంబంధం లేదని విచారణలో తేలిందని తెలిపారు. నకిలీ నంబర్ ప్లేట్ ఉపయోగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్ పేర్కొన్నారు.

ట్రిపుల్ ఆర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఉద్యమపోరు, మెదక్, సెప్టెంబర్ 24 : మెదక్ జిల్లాలో ట్రిపుల్ ఆర్ భూములను పకడ్బందీగా జాయింట్ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో గురువారం డిఆర్ఓ, ఆర్డిఓ, ఏడి సర్వే, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో ట్రిపుల్ ఆర్ సంబంధించిన భూములను ఫారెస్ట్ రెవెన్యూ అధికారులు కలసి జాయింట్ సర్వే నిర్వహించాలని రెవెన్యూ, ఫారెస్ట్ బౌండరీలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ట్రిపుల్ భూముల్లో రీ సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా రెవెన్యూ, అటవీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డీఎఫ్ఓ జో.జి నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, ఏడి సర్వే కిషన్, తాహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు, అక్రమాలపై ప్రత్యేక కమిటీ

ఉద్యమపోరు, హైదరాబాద్ - సెప్టెంబర్ 11 : రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భూ ఆక్రమణలు, అక్రమ భూ లావాదేవీలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు G.O.Ms.No.134, తేదీ 23-09-2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ శాసనసభలో సెప్టెంబర్ 16న రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-A, భూములకు సంబంధించిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై జరిగిన చర్చలో ప్రస్తావించిన అంశాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన భూ లావాదేవీలు, అసైన్డ్ భూములు, భూదాన్ భూముల ఆక్రమణలు, మల్లన్నసాగర్, మిడ్ మానేర్ ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించిన ఆరోపణలను కమిటీ పరిశీలించనుంది.కమిటీకి కాలేజియేట్ & టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎ. శ్రీదేవసేన, ఐఏఎస్ చైర్‌పర్సన్‌గా, రిజిస్ట్రేషన్స్ & స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, ఐఏఎస్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఐఏఎస్ సభ్యులుగా ఉంటారు. సంబంధిత జిల్లాలకు చెందిన కలెక్టర్లు ఆయా జిల్లాలకు సంబంధించిన అంశాలపై కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారు.భూ లావాదేవీల్లో చట్ట ఉల్లంఘనలు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన చర్యలను పరిశీలించి, బాధ్యులను గుర్తించడంతో పాటు తదుపరి చర్యలపై ప్రభుత్వానికి కమిటీ తగిన సిఫార్సులు చేయనుంది.

ఖరీఫ్ పంటల కొనుగోలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఉద్యమపోరు, రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24 : జిల్లా లో ఖరీఫ్ సీజన్ లో వివిధ పంటల కొనుగోళ్లు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ 2026- 2027 కొనుగోళ్ల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు దాదాపు 2,40,000 మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ చివరి వారం నుంచి వరి ధాన్యం మార్కెట్లోకి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. లారీల కాంట్రాక్టర్లు తాము అగ్రిమెంట్ ప్రకారం వాహనాలు అందుబాటులో పెట్టేలా చూడాలని, అన్నిటికి జీపీఎస్ యంత్రాలు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. కొనుగోళ్లకు అనుగుణంగా గన్ని సంచులు తెప్పించాలని సూచించారు. 4335 టార్పాలిన్లు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు 2, గ్రైన్ కాలిపర్స్ 270, తేమ యంత్రాలు 333, ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు 630, హస్క్ రిమూవర్లు 270, డ్రైయర్స్ 2 ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అవుతుందని, 4 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు కొనుగోలు కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ బుచ్చిబాబు, డీఎం గోపాల్, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు ముందే పనులు పూర్తి..

- **2027 ఫిబ్రవరి 29 లోపు కోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు..**
- **పుష్కర ఘాట్లు కోటేశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్..**

ఉద్యమపోరు, వెల్లటూర్, సెప్టెంబర్ 24 : 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ముందే పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా వెల్లటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో పుష్కరాల పనులకు మంత్రి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పుష్కర పనుల్లో భాగంగా ధర్మపురి నియోజకవర్గానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి పర్యటన సందర్భంగా సుమారు రూ 80 కోట్ల నిధులు కేటాయించాలని కోరగా రూ. 81 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కోటిలింగాల ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించిందని పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.16.13 కోట్లతో నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు. శంకుస్థాపన చేసిన ఈ పనులు 2027 ఫిబ్రవరి 29 లో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గోదావరి పుష్కరాలు నాటికి అన్ని పనులు పూర్తిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామని మంత్రి తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వం తల్లిదండ్రులు, వయోవృద్ధులు, దివ్యాంగుల వారోత్సవాల పోస్టర్ ను మంత్రి కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ఆవిష్కరించారు.

ఉస్మానియా యూనివర్సిటీకి ఇస్తామన్న రూ.వెయ్యి కోట్లు ఏవి?

- సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన కవిత

ఉద్యమపోరు, హైదరాబాద్, సెప్టెంబర్ 24 : ఉస్మానియా యూనివర్సిటీకి ఇస్తామన్న రూ.వెయ్యి కోట్లు ఏవి? అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఓయూ లా కాలేజ్ విద్యార్థులు ఐదారు నెలలుగా కనీస సౌకర్యాల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. దాదాపు పది నెలలుగా మెస్ సౌకర్యం లేకపోవడంతో పాటు తాగునీరు, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారి ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని కవిత తెలిపారు.అవసరమైతే విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అన్నా.. ఆపదలో వున్నాము, ఆదుకోండి

ఉద్యమపోరు, రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24 : ఇల్లంతకుంట మండలంలోని తిప్పపూర్ గ్రామానికి చెందిన శ్రీమంతుల మల్లేశం స్వరూపల కుమారుడు అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీ మంతుల వినయ్ గత కొన్ని రోజులుగా కిడ్నీ, లీవర్ సమస్య తో గురువారం కరీంనగర్ లోని "స్వస్తిక్ హాస్పిటల్ "అడ్మిట్ కావటం జరిగింది. కాగా డాక్టర్ల వైద్య పరీక్షల అనంతరం చికిత్స ఖర్చులకు సుమారు మూడు నుండి నాల్గు లక్షలు ఖర్చు కావడం జరుగుతుందని వైద్యలు తెల్పడం జరిగింది. రెక్క ఆడితే గాని డొక్క నిండని అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన వినయ్ తండ్రి కూడా చనిపోవడం చాలా విషాదకరం కావున నిస్సహాయ స్థితి లో ఉన్న తన తల్లి పరిస్థితి, మరియు వినయ్ ఆరోగ్య పరిస్థితి గమనించి సహృదయ తో దాతలు ముందుకు వచ్చి తోచిన ఆర్థిక సహాయం చేసి ఆదుకోగలరని కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. సహాయం చేయదలచినవారు పోన్ పే no 9948975160 గా తెలిపారు.

ఘనంగా రెండవ రోజు గణేష్ నిమజ్జనం ఉత్సవాలు..

ఉద్యమపోరు, జగిత్యాల్ల, సెప్టెంబర్ 24 : జగిత్యాల పట్టణంలో రెండవ రోజు కూడా గణేష్ నిమజ్జనం ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న కూడా భక్తులు భజన కోలాహాల నృత్యాల మధ్య గణపయ్యను గంగమ్మ ఒడిలోకి చేర్చుతున్నారు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ వారు బంధవస్తు పర్యవేక్షిస్తున్నారు.. మున్సిపల్, వైద్య, రెవెన్యూ, అగ్నిమాపక మరియు పోలీస్ శాఖలు సమన్వయంతో నిమజ్జన ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నాయి..

ట్రిపుల్ ఆర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఉద్యమపోరు, మెదక్, సెప్టెంబర్ 24 : మెదక్ జిల్లాలో ట్రిపుల్ ఆర్ భూములను పకడ్బందీగా జాయింట్ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో గురువారం డిఆర్ఓ, ఆర్డిఓ, ఏడి సర్వే, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో త్రిపుల్ ఆర్ సంబంధించిన భూములను ఫారెస్ట్ రెవెన్యూ అధికారులు కలసి జాయింట్ సర్వే నిర్వహించాలని రెవెన్యూ, ఫారెస్ట్ బౌండరీలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ట్రిపుల్ భూముల్లో రీ సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా రెవెన్యూ, అటవీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డీఎఫ్ఓ జో.జి నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, ఏడి సర్వే కిషన్, తాహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రిలో లంచాల ఆరోపణలు

- వైద్య సేవల పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు
- ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి

ఉద్యమపోరు, ఏటూరునాగారం, సెప్టెంబర్ 24 : ఏజెన్సీ ప్రాంతంలోని పేద, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో లంచాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి అన్నారు. వైద్యం కోసం వచ్చే పేద ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చుట్టుపక్కల ఐదారు మండలాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది పేద, గిరిజన ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని రవి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందాల్సిన వైద్య సేవల కోసం అదనంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటే పేద కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.వైద్య సేవలతో పాటు జనన ధ్రువీకరణ పత్రాలు వంటి ఇతర సేవల విషయంలోనూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు తదితరులు పాల్గొన్నారు.

సజ్జనార్‌పై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- వీరశైవ జంగమ సమాజం

- గణేశ్ నిమజ్జన వేడుకలను రాజకీయాలకు దూరంగా నిర్వహించాలి
- పోలీస్ అధికారులపై వ్యక్తిగత హెచ్చరికలు చేయడం తగదు: శివశ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి

ఉద్యమపోరు, ఎల్కతుర్తి, సెప్టెంబర్ 24 : హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ రాష్ట్ర వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి తీవ్రంగా వ్యతిరేకించారు. పోలీస్ కమిషనర్‌ను ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు, హెచ్చరికల ధోరణిలో మాట్లాడటం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. గణేశ్ నిమజ్జన వేడుకల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, రెచ్చగొట్టే లేదా అభ్యంతరకరమైన పాటలు, నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో ధ్వని వ్యవస్థలను వినియోగించడంపై పోలీసులు చర్యలు తీసుకుంటామని సజ్జనార్ పేర్కొన్న నేపథ్యంలో ఈ వివాదం నెలకొంది. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా నిర్వాహకులు సహకరించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సజ్జనార్‌పై విమర్శలు చేశారు. గణేశ్ నిమజ్జనంలో కేసీఆర్‌కు సంబంధించిన పాటలపై ఆంక్షలు విధించడాన్ని ప్రశ్నిస్తూ ఆయన వ్యాఖ్యలు చేసినట్లు తాజా వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యాఖ్యలపై సదా నిరంజన్ సిద్ధాంతి స్పందిస్తూ.. విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన పాటల వల్లనైనా ఉత్సవాల పవిత్రతకు భంగం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో పోలీస్ అధికారులను ఉద్దేశించి వ్యక్తిగత హెచ్చరికలు చేయడం, ఉన్నత పదవిలో ఉన్న అధికారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా అర్చక సమాజం నుంచి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో జరిగేలా అన్ని వర్గాలు పోలీసులకు, అధికారులకు సహకరించాలని సదా నిరంజన్ సిద్ధాంతి కోరారు.

రూ.4,516లకు గణపతి లడ్డూ కైవసం

- చింతలపల్లి ఎస్సీ కాలనీలో ఉత్సాహంగా లడ్డూ వేలంపాట
- అడ్డూరి అనిల్, లావణ్య దంపతులకు దక్కిన గణపతి ప్రసాదం

ఉద్యమపోరు, హనుమకొండ/ ఎల్కతుర్తి , సెప్టెంబర్ 24 : ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గణపతి నిమజ్జనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాట భక్తుల సందడి మధ్య ఉత్సాహంగా సాగింది. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లడ్డూను వేలం వేయగా, భక్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ప్రసాదాన్ని దక్కించుకునేందుకు పోటీ పడ్డారు.వేలంపాటలో అడ్డూరి అనిల్, లావణ్య దంపతులు రూ.4,516లకు గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూను వారికి అందజేసి అభినందనలు తెలిపారు. గణపతి లడ్డూ దక్కడం పట్ల అనిల్, లావణ్య దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. గణపతి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలు, భజనలతో నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో చింతలపల్లి ఎస్సీ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్‌కు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శ

- భీమారంలోని నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే

ఉద్యమపోరు, హనుమకొండ, సెప్టెంబర్ 24 : పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గురువారం భీమారంలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తన బ్యాచ్‌మేట్, మిత్రుడైన సుదర్శన్ గౌడ్‌తో ఎమ్మెల్యే నాగరాజు కొంతసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రస్తుతం అందుకుంటున్న వైద్య సేవలు, వైద్యుల సూచనలు, తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ శాఖలో కలిసి పనిచేసిన రోజుల్ని, సుదర్శన్ గౌడ్ అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.అనారోగ్య సమయంలో ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందించే ధైర్యం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. సుదర్శన్ గౌడ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. అవసరమైన సమయంలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. పదవులు, బాధ్యతలు మారినా స్నేహబంధం కొనసాగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఇంట్లో బంధించిన జయశ్రీకి న్యాయం చేయాలి

- అత్త మీరాబాయిపై చర్యలు తీసుకోవాలి..
- గతంలో రాసిచ్చిన ఇల్లు, ఆస్తులు ఇప్పించాలి
- సుబేదారి ఎస్సై సుమన్‌కు ప్రజా సంఘాల నేతల వినతి

ఉద్యమపోరు, హన్మకొండ, సెప్టెంబర్ 24 : న్యాయం కోసం ఇంట్లో బంధించబడి నిరసన చేస్తున్న గూడూరు జయశ్రీకి న్యాయం చేయాలని దళిత, మహిళా, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జయశ్రీని ఇంట్లో బంధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె అత్త మీరాబాయిపై చర్యలు తీసుకోవడంతో పాటు, గతంలో రాజీ సందర్భంగా రాసిచ్చిన ఇల్లు, ఆస్తులను బాధితురాలికి ఇప్పించాలని కోరారు. ఈ మేరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు గురువారం సుబేదారి ఎస్సై సుమన్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, నేదునూరి జ్యోతి, మాదాసి సురేష్ మాట్లాడుతూ.. గతంలో జయశ్రీపై ఆమె అత్త మీరాబాయి, భర్త రాధాకృష్ణ గృహహింసకు పాల్పడుతూ అదనపు కట్నం కోసం వేధించారని తెలిపారు. దీనిపై జయశ్రీ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తదనంతరం జరిగిన రాజీ ప్రకారం హన్మకొండ రాంనగర్‌లోని ఇల్లు, హన్మకొండ చౌరస్తాలోని దుకాణాన్ని నోటరీ పత్రం ద్వారా జయశ్రీకి రాసిచ్చినట్లు వారు తెలిపారు. అయితే పదేళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించి జయశ్రీతో పాటు ఆమె కుమారుడు కార్తీక్, కుమార్తె తేజస్వినిని ఇంటి నుంచి బయటకు పంపించారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులను తీసుకొచ్చి జయశ్రీ సామగ్రిని తరలించే ప్రయత్నం చేయగా, ఆమె తన కుమార్తెతో కలిసి అడ్డుకున్నారని తెలిపారు. దీంతో మీరాబాయి, ఆమె కుమార్తెలు, అల్లుళ్లు కలిసి జయశ్రీ, ఆమె కుమార్తెను ఇంట్లోనే బంధించి తాళం వేసినట్లు ఆరోపించారు. బాధితులు తిండి, నిద్ర లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని బాధితురాలికి రక్షణ కల్పించడంతో పాటు, ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్సై సుమన్‌ను ప్రజా సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, చైతన్య మహిళా సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ జంపాల కళా, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సంగెం స్వరూప, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నాయకురాలు పొడిచేటి సరళ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం

- పాక్షికంగా దెబ్బతిన ఇంటిని పరిశీలించిన
- మండల ఎంపీడీవో సూర్య ఆదర్శ్ గౌడ్
- మండల తహసిల్దార్ శ్రీనివాస్
- ఉమ్మడి మండలాల మాజీ జడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్

ఉద్యమపోరు, వనపర్తి , సెప్టెంబర్ 24 : చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మి పల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్ ఇంట్లు పిడుగుపాటుకు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మండలాల మాజీ జడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్ ఉటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చిన్నంబావి మండల ఎంపీడీవో మరియు తాహసిల్దార్ గారికి సమాచారం ఇచ్చి పిడుగుపాటుకు దెబ్బతిన్న సంపంగి ఈశ్వర్ ఇంటిని పరిశీలన చేశారు. విద్యుత్ వైర్లలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లోని విద్యుత్ పరికరాలు, సామగ్రి దెబ్బతిన్నట్లు సమాచారం. అగ్ని ప్రమాదంతో ఇంట్లో కూలరు, వాషిం, ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, గోడలు, కరెంటు వైర్లు బోర్డులు మీటరు పైభాగం తదితర ప్రాంతాలు పొగతో నల్లగా మారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఇంట్లోని సామగ్రి, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లడంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తెలిపింది. పిడుగుపాటుకు ప్రాణనష్టం తప్పినా.. భారీ ఆస్తి నష్టం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ఘటనతో సంపంగి ఈశ్వర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ఘటనను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com